వరినాట్లు త్వరగా పూర్తి చేయండి

మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత

కడ్తాల్: మూడు వారాల వయసు గల నారుతో సెప్టెంబర్ మొదటి వారంలోపు వరినాట్లు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన వరిపంటను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించి, పంటలో అధిక దిగుబడులు సాధించడానికి సాగులో సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వరినాట్లు వేసుకునే వారం రోజుల ముందు గుంట నారుమడికి 400 గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలను నారుమడిలో, ఇసుకతో కలిపి చల్లుకోవాలని సూచించారు. వరిలో పైపాటుగా రసాయన ఎరువులు దుబ్బు చేసే దశలో, అంకురం తొడిగే దశలో బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి, 48 గంటల తర్వాత నీరు పెట్టాలని తెలిపారు. వరిలో దోమపోటు ఉధృతిని తగ్గించుటకు, ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటను , తూర్పు పడమర దిశలలో ఏర్పాటు చేసుకోవాలని, వరిలో పిలకలు , దుబ్బు చేసే దశలో కాండం తొలిచే పురుగును గమనించినట్లయితే, నివారణకు 10 కిలోల కార్బోఫ్యూరాన్3జీ లేదా, కిలో కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ లేదా, 4కిలోల క్లోరాంట్రినిలిఫోల్ 0.40 లేదా, 6 కిలోల ఫిప్రోనిల్ 0.3జీ గుళికలను పొలంలో వేసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాములు, లేదా, క్లోరాంట్రినిలిఫోల్ 0.3 మి.లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రమణ రైతులు రాధాకృష్ణారెడ్డి ఉన్నారు.



కడ్తాల్: వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత

క్లుప్తంగా

ఘనంగా బోనాలు



బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తురాలు

తుర్కయంజాల్ : పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లను చేసినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఉత్సవాల్లో కౌన్సిలర్ కొంద్రు మల్లేష్, బ్యాంకు డైరెక్టర్ కొంద్రు స్వప్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఐలయ్య తదితరులు

తుర్కయంజాల్: దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య తెలిపారు. గురువారం పురపాలక సంఘం, కమ్మగూడ 22వ వార్డు ఇందిరమ్మ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మకాలనీ అధ్యక్షుడు హనుమంత్‌గౌడ్, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రాజునాయక్, శంకర్, గోవింద్, కృష్ణ, శివ పాల్గొన్నారు.

మండలం సాధించే వరకు పోరాటం ఆగదు

కాంగ్రెస్ నేత డేవిడ్



దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, డేవిడ్, తదితరులు

తలకొండపల్లి: మండలంలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం చేసే వరకు పోరాటం ఆగదని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 53వ రోజుకు చేరాయి. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులు, వనరులు అన్ని ఉన్నాయని, అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు కావడం లేదని డేవిడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.నాయకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడం కారణంగానే గట్టుఇప్పలపల్లి మండలం ఏర్పాటు కావడం లేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నగదును అందజేస్తున్న విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు తారమతిపేట గ్రామానికి చెందిన జెట్టా బీరప్ప మే 30న మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి సహకార సంఘం రూ.25వేల ఆర్థిక సహాయం గురువారం సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి చేతుల మీదుగా మృతుడి భార్య మైసమ్మకు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ భరత్, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్, అకౌంటెంట్ రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



నియామకం పత్రం అందజేస్తున్న మల్లేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆకుతోటపల్లిలో గురువారం మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మల్లేశ్, కోకన్వీనర్ విజయ్‌చందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా శేఖర్, సభ్యుడిగా సాయిబాబా, కుమార్, సాయిలను ఎన్నుకున్నారు.

మొల్ల విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

తలకొండపల్లి: మండల కేంద్రంలో శాలివాహన కుమ్మరి సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్ల విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్త్రీలు, తక్కువ కులాలపై వివక్ష, వర్ణ దురహంకారాన్ని ఆనాడు మొల్ల ఎదుర్కొందన్నారు.

కుండలు చేయడం ఎంత కష్టమో, కవిత్వం చెప్పడం అంతే కష్టమని మొల్ల పేర్కొన్నట్లు వారు వివరించారు. చిన్న పిల్లలకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో మొల్ల, రామాయణం రచించిందన్నారు. ఇంతా ప్రతిభ గల మొల్ల విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి దుర్గాపురం బాలకృష్ణ, సీనియర్ నాయకులు తిరుపతి, బాలకృష్ణ, రమేష్, మధు, శేఖర్, మల్లేష్, మధు, లక్ష్మణ్, హన్‌మాన్, కుమార్, రాజు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

'బస్ ట్రాకింగ్ గమ్యం యాప్' పై అవగాహన



ప్రయాణీకులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్ గమ్యం యాప్ పై ఇబ్రహీంపట్నం బస్టాండ్ అవరణలో గురువారం ప్రయాణీకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గమ్యం యాప్ పోస్టర్లను ప్రదర్శించారు. స్థానిక ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి మాట్లాడుతూ.. గమ్యం యాప్ ద్వారా ఏ బస్సులు ఎప్పుడు వస్తాయో కచ్చితమైన సమయం తెలుస్తుందన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడికి బస్సులు వెళ్తున్నాయో యాప్‌లో చూసుకోవచ్చునన్నారు. ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా గమ్యం యాప్ ఉంటుందని చెప్పారు.

గిరిజన విద్యార్థినికి సన్మానం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన పాత్లవత్ లక్ష్మణ్ నాయక్- మంజుల దంపతుల కూతురు హిమబిందు నీట్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీట్ సాధించింది.గురువారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్‌లు విద్యార్థి హిమబిందును అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అంజి తదితరులు ఉన్నారు.




హిమబిందును సన్మానిస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్‌గుప్త, తదితరులు

బీఆర్ఎస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు

బీజేపీ కిసాన్‌మోర్చా

యాచారం: పక్షపాతం లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం యాచారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌తో కలిసి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. దళితబంధు, బీసీ బంధు లాంటి పథకాలు పక్షపాతం లేకుండా గ్రామ సభలు పెట్టి అర్హులను గుర్తించి వారికి ఇస్తే బాగుంటుందన్నారు. అయితే దానికి భిన్నంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పథకాలను వారి పార్టీ కార్యకర్తలకే ఇస్తుందని ఆరోపించారు. వెంటనే అర్హులంకు పథకాలు అములు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు రమేష్, కిసాన్ మోర్చా నాయకులు జంగయ్యగౌడ్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, బీజేవైఎం శాంతికుమార్, ఉపాధ్యక్షుడు రాజుపాల్గొన్నారు.

చిన్నారుల చదువులకు ట్రస్టు చేయూత




చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు, తదితరులు

తలకొండపల్లి: తండ్రి లేని పిల్లల చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు చేయూత నందించాడు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన రమాదేవి, శ్రీనివాసుల కుమారుడు శ్రీశాంత్ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శ్రీనివాసులు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. దీంతో శ్రీశాంత్ చదువుకోవడం కష్టంగా మారింది. సర్పంచ్ రమేష్‌యాదవ్, సుదర్శన్‌రెడ్డిల సహకారంతో శ్రీశాంత్ జెడ్పీటీసీని కలుసుకొని చదువుకోడానికి సహాయం చేయాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ ట్రస్టు ద్వారా చదివిస్తానని, ఖర్చులను తానే భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.గురువారం ట్రస్టు సభ్యులచే రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత, సుదర్శన్‌రడ్డి, సర్పంచ్ రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ అజీజ్, ఆంజనేయులు గౌడ్, అశోక్‌గౌడ్, శేఖర్, భీముడు, బుచ్చిబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమగీతం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్ గౌడ్
- వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మంచాల: బీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్‌ని గెలిపించాలని రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్ గౌడ్ అన్నారు. గురువారం మంచాల మండలంలోని లోయపల్లి, ఎల్లమ్మ తండాల్లో కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమ గీతం పాడాలన్నారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగిస్తుందన్నారు. కనీసం సామాన్య పేద ప్రజలకు ప్రశ్నించే హక్కు లేకుండా చేస్తుందని విమర్శించారు. ముఖ్యంగా చదువుకున్న యువత, మహిళలు బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ప్రస్తావించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రజల వద్దకు స్వపరిపాలన తీసుకొస్తుందని అన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణ, శ్రీహరి, శివ, బుగ్గరాములు, ప్రసాద్, పరమేష్, సత్యం, నందకిశోర్, స్వామి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శేఖర్‌గౌడ్ , నేతలు

రేపు బీజేపీ మండల కార్యాలయం ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్ : బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల పార్టీ కార్యాలయాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు విష్ణుగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరు కానున్నారని, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, జంగమయ్య, వీరస్వామిగౌడ్, శ్రీకాంత్, రమేష్, శ్రీశైలం, రమాదేవి, మీనాక్షిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కడ్తాల్ తహసీల్దార్‌గా షేక్ ముంతాజ్



కడ్తాల్: కడ్తాల్ నూతన తహసీల్దార్‌గా షేక్ ముంతాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వర్ బదిలీపై ఇబ్రహీంపట్నం మండలానికి వెళ్లగా, ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్ ముంతాజ్ కడ్తాల్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్ ముంతాజ్ మాట్లాడుతూ.. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్ బదిలీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ చంద్రకళ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అన్వర్ తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలను స్వీకరించారు. చంద్రకళ డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి పొందడం, ప్రస్తుతం ఆ పోస్టులు ఖాళీ లేకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లింది.

అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌గా రవీందర్



అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్‌గా రవీందర్ దత్తు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన అశోక్‌రెడ్డికి పదోన్నతి లభించింది. దీంతో ఖాళీ అయిన స్థానంలో రవీందర్ దత్తును నియమిస్తూ జిల్లా కలెక్టర్ హరీష్ ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రయాన్-3 విజయవంతంపై ర్యాలీ



జెండా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తలకొండపల్లి: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై మండల కేంద్రంలోని అక్షర స్కూల్ విద్యార్థులు గురువారం 100 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ తీశారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై ల్యాండ్ చేయడం భారతదేశం విశ్వగురువుగా నిలిచిందన్నారు. ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్ర వేత్తలకు శుభాకాంక్షలు చెప్పుతూ, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడల కార్యదర్శిగా భీముడు



భీముడుని సన్మానించిన పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు

కడ్తాల్: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)8వ జోనల్ క్రీడల కార్యదర్శిగా ముద్విన్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భీముడు నియమితులయ్యారు. గురువారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల సమావేశం హెచ్ఎం శ్రీనివాసచారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలకు చెందిన పీడీలు, పీఈటీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీముడు మాట్లాడుతూ.. మన జోన్ జిల్లా క్రీడాకారులకు మరింత శిక్షణ ఇచ్చి, పతకాలు సాధించేలా ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 31లోపు మండలాల జట్లను తయారు చేసుకోవాలని, వచ్చే నెల 10లోపు జోనల్‌స్థాయి పోటీలకు జిల్లా ఎంపికలు పూర్తి చేసుకుని జట్లను తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం గతంలో జోనల్ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రమోహన్‌ను ఘనంగా సన్మానించి, అభినందించారు. నూతన జోనల్ కార్యదర్శిగా నియమితులైన భీముడుని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పీడీలు రఘుమారెడ్డి, ప్రసాద్, పీఈటీలు రామకృష్ణారెడ్డి, సుశీల, రాజు, రాధ, నర్సింహారావు, ఆనంద్‌బాబు, పాండు, దశరథం, పరమేశ్, కృష్ణకాంత్, మమత, వెంకటేశ్వరీ, మంజుల, రమేశ్ తదితరులు ఉన్నారు.

శభాష్ మేఘన

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యా కుసుమం



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఎర్రగుంటకు చెందిన కత్తుల దేవదాసు అండాలు దంపతులకు నలుగురు ఆడపిల్లలు. వారు కూలీనాలి చేసుకొని పిల్లలను పోషిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేకున్న పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది ప్రయోజకులుగా చేయాలన్న సంకల్పం ఆ దంపతులది. వారి మూడో కూతురు మేఘన గౌలిదొడ్డి, నార్సింగి ప్రభుత్వ గురుకులాల్లో చిన్ననాటి నుంచి ఆమె విద్యాభ్యాసం కొనసాగింది. వైద్య వృత్తిని చేపట్టి పేదలకు సేవ చేయాలన్న ధృడమైన సంకల్పం ఆమె మదిలో పెట్టుకుంది. ఆ దిశగా చేసిన కృషి ఫలితంగా నీట్‌లో ర్యాంకు సాధించి ఆమె అందరికి ఆదర్శంగా నిలిచింది. కౌన్సిలింగ్‌లో సిద్దిపేటలో గల ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి తన కలను నెరవేర్చుకుంది.

బీఆర్ఎస్‌దే మరోసారి అధికారం



ఆమనగల్లు: విలేకరులతో మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలంతా సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజారంజక పాలన అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రజాసంక్షేమ పథకాలు చేస్తున్నారని ఆయన వివరించారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించి అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుభాష్, కిరణ్, శివకుమార్, సుమన్‌నాయక్, రైసల్, శేఖర్ పాల్గొన్నారు.

నేడు యాదవ యుద్ధభేరి సభ

ఇబ్రహీంపట్నం: నాగోల్ శుభం ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరగనున్న యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్వర్‌యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు వి వెంకటేశ్‌యాదవ్‌లు వేర్వేరు ప్రకటనల్లో గురువారం పిలుపునిచ్చారు. గొర్రెలతో పాటు రాజ్యాధికారంలో సముచిత స్థానం యాదవులకు కల్పించాలన్నారు. రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం 18 శాతం యాదవులు ఉన్నారని తెలిపారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తమకు రావాల్సిన వాటాను సాధించుకునేందుకు సమరభేరి మోగించాలని పేర్కొన్నారు.

బీసీబంధుతో మేలు

నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్ : సీఎం కేసీఆర్ ప్రకటించిన 'బీసీబంధు' ద్వారా మొదటి విడతలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 12 నాయీబ్రాహ్మణ కుటుంబాలకు మేలు జరిగిందని నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. క్షౌర వృత్తిపై ఆధారపడిన నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డికి మండల నాయీబ్రాహ్మణ సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల ఆందోళన



ఇబ్రహీంపట్నం: నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గురువారం ఆ కాంట్రాక్ట్ ఉద్యోగులు మూతికి నల్లబట్ట కట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం తమ సమస్యలు పరిష్కరమవుతాయని భావిస్తే అందుకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఎంటీఎస్ ప్రకటించాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సంపత్, శేషు, అశోక్, బుచ్చప్ప, అమీనా, రాధాకృష్ణ, రవి, రఘులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఆమనగల్లు: విద్యాశాఖలో సమగ్రశిక్షణలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని వివిధ పార్టీల నేతలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల రిలే నిరాహార దీక్షకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, పీఆర్టీయూ, యూటీఎఫ్, టీపీయూఎస్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆచారి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఇప్పటివరకు వేతన టైం స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రతి ఉద్యోగికి పదిలక్షల బీమా, 5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖలో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. అనంతరం ఎమ్మార్వో, ఎంపీడీఓ కార్యాలయంలో వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సాయికుమార్, శ్రీశైలం, తిరుపతి, మల్లేశ్, శ్రీరాములు, షేక్ అహ్మద్, కిషన్, యాదగిరి, లక్ష్మయ్య, జితేందర్‌రెడ్డి, రవి, విజయ్‌కుమార్, శేఖర్, మధు, అమర్, స్వాతి, జంగమ్మ, మంజుల, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుదర్శన్, చందర్, ఆంజనేయులు, శ్రీను, వెంకటస్వామి, మల్లయ్య, యాదయ్య, పద్మ, భగవంత్‌రాజు, సురేశ్, అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు